SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 847 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | మంగళవారం 07-07-2026


★ఆయన నిండు నూరేళ్లు పూర్తి ఆరోగ్యంతో జీవించాలి

★పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి: సీఎం చంద్రబాబు

★లోకానికి దయ, అహింస, కరుణ వంటి ఉన్నత విలువలను పరిచయం చేశారని కితాబు

★రాబోయే రోజుల్లో కుప్పం నియోజకవర్గం దేశానికే రోల్ మోడల్ గా నిలుస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

★మూడు రోజులపాటు కుప్పంలో పర్యటించిన ఆయన.. పలు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు.

★నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటన ఎంతో ఉత్సాహంగా సాగిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

★కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఆయన.. ఆదివారం పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు.

★టిబెట్‌కు చెందిన బౌద్ధ మత గురువు దలైలామా జన్మదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు అందజేశారు


★రాష్ట్రంలో పొలిటికల్ గవర్నెన్స్ పైస్థాయిలో మాత్రమే కాకుండా.. క్షేత్రస్థాయిలో కూడా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.

### కుప్పం పర్యటన నాకెంతో

# ఆనందాన్నిచ్చింది

**క్షేత్రస్థాయిలో పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలి**

**దలైలామాకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు**




రాబోయే రోజుల్లో కుప్పం నియోజకవర్గం దేశానికే రోల్ మోడల్ గా నిలుస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. మూడు రోజులపాటు కుప్పంలో పర్యటించిన ఆయన.. పలు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటన ఎంతో ఉత్సాహంగా సాగిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అలాగే ప్రశాంతమైన కుప్పం పర్యటన తనకు కొత్త శక్తిని ఇచ్చిందని వెల్లడించారు. కంగుంది భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే 30 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. బంగారు కుప్పం సాకారం కోసం సమగ్ర విజన్ ను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో పొలిటికల్ గవర్నెన్స్ పైస్థాయిలో మాత్రమే కాకుండా.. క్షేత్రస్థాయిలో కూడా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఆయన.. పార్టీ శ్రేణులతో మిగతా 2లో

### 'కాన్పుల మధ్య విరామం..

# తల్లీబిడ్డకు క్షేమం'

నా రక్తంలోనే కాషాయం ఉంది

చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకునే వ్యక్తి పేర్ని నాని అని సత్యకుమార్ ఎద్దేవా

తాను పదవుల కోసం ఆశపడే వ్యక్తి కాదని వ్యాఖ్య

జగన్ ప్రజా వ్యతిరేక విధానాలపైనే తన పోరాటమన్న మంత్రి

11 నుంచి 18 వరకు ప్రపంచ జనాభా దినోత్సవ ప్రచారం




అమరావతి: వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ నేత సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన.. పేర్ని నానిని 'చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకునే వ్యక్తి'గా అభివర్ణించారు. తాను రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మారే అవకాశవాదిని కాదని, తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే వ్యక్తినని స్పష్టం చేశారు. "నేను పదవుల కోసం ఆశపడే వ్యక్తిని కాదు. నా రక్తంలోనే కాషాయం, బీజేపీ సిద్ధాంతం ఉన్నాయి. మిగతా 2లో

### గల్లంతైన మత్స్యకారులలో ఒక్కరి ఆచూకే లభించింది



❄విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు గల్లంతు కావడం బాధాకరమని ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

❄గల్లంతైన ఏడుగురు మత్స్యకారులలో.. కేవలం ఒక్కరి ఆచూకీ మాత్రమే లభించిందని తెలిపారు.

❄రెస్క్యూ ఆపరేషన్స్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు గల్లంతు కావడం బాధాకరమని ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారులలో.. కేవలం ఒక్కరి ఆచూకీ మాత్రమే లభించిందని తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్స్ ప్రక్రియను మిగతా 2లో

### ప్రశ్నించే గొంతు నొక్కే కుట్రను

# వైయస్సార్‌సీపీ సహించదు


**ప్రశ్నిస్తే అక్రమ కేసులా?: అంబటి**

●గుంటూరులోని వైయస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు.

●సోషల్ మీడియా యాక్టివిస్టులపై ప్రభుత్వం దౌర్జన్యం

●చట్టవ్యతిరేకంగా కేసులు. యథేచ్ఛగా అరెస్టుల పర్వం

●బాధితులకు అండగా నిల్చి న్యాయ పోరాటం చేస్తాం



గుంటూరు:రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేసే కుట్ర జరుగుతోందని, సోషల్ మీడియా యాక్టివిస్టులపై చట్టవ్యతిరేకంగా మిగతా 2లో

### భారత ఏఐ రాజధానిగా


# ఏపీని తీర్చిదిద్దడమే ధ్యేయం

**ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలు**

●ఏపీలో మైక్రో ఎల్ఈడీ హబ్..

●రతన్ టాటా హబ్ ద్వారా కొరియన్ స్టార్టప్‌లకు ఏపీకి ఆహ్వానం

●అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటం-ఏఐ విశ్వవిద్యాలయం



శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏపీని ఆవిష్కరణలు, తయారీ రంగంలో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ఆయన కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో రాబోయే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లను ప్రోత్సహించి, మిగతా 2లో

### ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం



⌘పౌరులపై ఆర్థిక భారాన్ని చాలావరకు తగ్గించాం

⌘ప్రజలను భయపెట్టాలని చూసిన శక్తులకు నిరాశే మిగిలింది

⌘ఏప్రిల్--జూన్‌లో చమురు కంపెనీలు రూ.75,000 కోట్లు నష్టపోయాయి

ఈ శతాబ్దంలో అతిపెద్ద ప్రపంచ ఇంధన సంక్షోభాల్లో ఒకదానిని మనం మిగతా 2లో

# "మెలోని నన్ను వెంటాడుతోంది.. రక్షించండి"

●ఇటలీ ప్రధానిపై ట్రంప్ సెటైరికల్ పోస్ట్!

●అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఎపిసోడ్ గురించి అందరికీ తెలిసిందే. జీ 8 సమ్మిట్‌లో మెలోనీ తనతో కలిసి ఫొటో దిగాలని వేడుకుందంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారమే రేపాయి.




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఎపిసోడ్ గురించి అందరికీ తెలిసిందే. జీ 8 సమ్మిట్‌లో మెలోనీ తనతో కలిసి ఫొటో దిగాలని మిగతా 2లో

## అమెరికా మాత్రమే కాదు.. మాకు భారత్ అనే గొప్ప మిత్రదేశం ఉంది

●భారతీయుల నుంచి అపార మద్దతు లభిస్తోందన్న నెతన్యాహు

●ఇతర దేశాల నేతలు కూడా వ్యక్తిగతంగా మద్దతు ఇస్తున్నారని వెల్లడి



ఇజ్రాయెల్‌కు అమెరికా ఒక్కటే బలమైన మిత్రదేశం కాదని, భారత్ సహా మరికొన్ని దేశాలు కూడా తమకు గట్టి మద్దతుగా నిలుస్తున్నాయని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మిగతా 2లో

### ఏపీ అభివృద్ధికి అడ్డుపడితే

# ప్రజలు సహించరు



❖వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

❖ఏపీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అడ్డుపడితే ప్రజలు సహించరని.. మంచిని చెడుగా చూపిస్తే, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అడ్డుపడితే ప్రజలు సహించరని.. మిగతా 2లో

➤ప్రశ్నించే గొంతును నొక్కడానికి.. అత్యంత ప్రమాదకర ధోరణి వైపు పోలీసు వ్యవస్థను నడిపిస్తున్నారు

➤సీఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర ఆగ్రహం

➤సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మాత్రం కేసులు, అరెస్టులు, చిత్రహింసలు, నాన్ బెయిలబుల్ కేసులా?

➤రాష్ట్రానికి కావాల్సింది రౌడీ పోలీస్ రాజ్యం, జంగిల్ రాజ్ కాదు.. ప్రజలకు భద్రత, బాధితులకు న్యాయం చేసే వ్యవస్థ కావాలి

➤'హే రామ్.. సేవ్ ఆంధ్రప్రదేశ్' అంటూ 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ పోస్టు

➤రాష్ట్రంలో రాజకీయ అణచివేత చర్యల కోసం... ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకు పోలీసు వ్యవస్థను అత్యంత ప్రమాదకర ధోరణి వైపు నడిపిస్తున్నారంటూ సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేసినా

# అరెస్టులు లేవు..

**'హే రామ్.. సేవ్ ఆంధ్రప్రదేశ్'**

**ప్రజలకు భద్రత కల్పించే పాలన కావాలి**

రాష్ట్రంలో రాజకీయ అణచివేత చర్యల కోసం... ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకు పోలీసు వ్యవస్థను అత్యంత ప్రమాదకర ధోరణి వైపు నడిపిస్తున్నారంటూ సీఎం చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేసినా అరెస్టులు లేవు.. కానీ సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మాత్రం కేసులు, అరెస్టులు, చిత్రహింసలు, మిగతా 2లో

### చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది



2లో


⏩16 వేల ఎకరాల భూ పట్టాల సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిలిత్వరలో సీఎం, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం:

⏩శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్ సమీపంలోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం సుమారు 300 మంది రైతులతో కలిసి బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి భారీ ర్యాలీగా చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## "మెలోని నన్ను వెంటాడుతోంది.. రక్షించండి"

వేడుకుందంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారమే రేపాయి.దానిపై మెలోని కూడా అంతే స్ట్రాంగ్‌గా కౌంటర్ ఇచ్చారు. అయితే, తాజాగా ట్రంప్ మరోసారి మెలోనీపై సెటైరికల్ పోస్ట్ చేసి మాటల యుద్ధానికి మరోసారి తెరలేపారు.డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఎడిట్ చేసిన ఓ ఫొటోను షేర్ చేశారు. అందులో మెలోనీ చిరునవ్వుతో ట్రంప్ వైపు చూస్తున్నట్లుగా చూయించారు. దానికి నాకు కోర్టు నుంచి ఆర్డర్ కావాలి అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చారు. మెలోనీ తనను వెంటాడుతోందని, ఆమె నుంచి రక్షించేందుకు కోర్టు ఆర్డర్ కావాలంటూ పోస్ట్ చేయడం ఆసక్తికరంగా మారింది."ఆమె నుంచి నన్ను రక్షించేందుకు రెస్ట్రైనింగ్ ఆర్డర్ అవసరం" అంటూ ట్రంప్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే 80 సంవత్సరాల ట్రంప్, 49 సంవత్సరాల మెలోనీ ఎపిసోడ్ మాత్రం ప్రపంచ దేశాలకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తోంది. త్వరలో నాటో సదస్సు జరగనుండటం.. ఈ సదస్సులో ట్రంప్, మెలోనీతో పాటు నాటో కూటమికి చెందిన దేశాధినేతలు కూడా పాల్గొననున్నారు. ఇలాంటి సమయంలో ట్రంప్ పోస్ట్ మరింత ఆసక్తిని రేపింది.జీ7 సదస్సు సందర్భంగా మెలోనీ తనతో ఫొటో దిగాలంటూ పదే పదే కోరారని ట్రంప్ ఆరోపించడంతో ఈ వివాదం మొదలైంది. ట్రంప్ వ్యాఖ్యలను ఇటలీ ప్రధాని మెలోనీ పూర్తిగా ఖండించడమే కాకుండా ఇదంతా పూర్తిగా కల్పితమంటూ ఆమె స్పష్టం చేశారు. ఇటలీ గానీ, తాను గానీ ఎవ్వర్నీ ఎప్పుడూ వేడుకోవాల్సిన అవసరం లేదంటూ ఆమె గట్టిగానే చెప్పారు.తాను అమెరికా వ్యతిరేకిని కాదని, తనకు ఎవరి ముందు మోకరిల్లే వ్యక్తి కూడా కాదంటూ మెలోనీ కాస్త ఘాటుగా చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలపై వివాదం చెలరేగిన నేపథ్యంలో ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీ అమెరికా పర్యటనను కూడా రద్దు చేసుకున్నారు. ఇరాన్‌పై అమెరికా చర్యలకు ఇటలీ పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వకపోవడమే ఈ వివాదానికి అసలు కారణమని అంతర్జాతీయ మీడియా చెబుతోంది.

## అమెరికా మాత్రమే కాదు.. మాకు భారత్ అనే గొప్ప మిత్రదేశం ఉంది

ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నెతన్యాహు మాట్లాడుతూ.. "మాకు భారత్ అనే గొప్ప మిత్రదేశం ఉంది. 140 కోట్ల జనాభా ఉన్న ఆ దేశం నుంచి అపారమైన మద్దతు లభిస్తోంది. సోషల్ మీడియాలో భారతీయుల నుంచి వేల సంఖ్యలో మద్దతు సందేశాలు వస్తున్నాయి" అని చెప్పారు.అనేక దేశాల నేతలు తమకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి మద్దతు తెలుపుతున్నారని నెతన్యాహు వెల్లడించారు. తమ దేశాల్లో ప్రజాభిప్రాయం కారణంగా బహిరంగంగా చెప్పలేకపోయినా.. రక్షణ, కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ టెక్నాలజీ వంటి రంగాల్లో ఇజ్రాయెల్‌తో కలిసి పనిచేయాలని ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.గత నెలలో వాన్స్ మాట్లాడుతూ.. "ఇజ్రాయెల్‌కు ఇప్పుడు మిగిలిన ఏకైక శక్తిమంతమైన మిత్రదేశం అమెరికానే" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో అమెరికా కుదుర్చుకున్న తాత్కాలిక ఒప్పందాన్ని ఇజ్రాయెల్ నేతలు విమర్శించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నెతన్యాహు తాజా వ్యాఖ్యలను వాన్స్ వ్యాఖ్యలకు పరోక్ష సమాధానంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## గల్లంతైన మత్స్యకారులలో ఒక్కరి ఆచూకే లభించింది

మరింత వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ ని కనుగొనాలని అన్నారు. బాధిత మత్స్యకార కుటుంబ సభ్యులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని తెలిపారు. సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు క్షేమంగా ఇంటికి చేరుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని చెప్పారు. కాగా, వైఎస్సార్‌సీపీ నేతల బృందం ఆదివారం ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లి పరిశీలించింది. బాధిత మత్స్యకార కుటుంబాలను విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కేకే రాజు, వైసీపీ నేతలు పరామర్శించారు.ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ.. "గల్లంతయిన వారికోసం ప్రభుత్వం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టేలా చేయాలి. సమాచారం అందిన వెంటనే గాలింపు ప్రారంభించి ఉంటే మత్స్యకారుల ఆచూకీ దొరికేది. బాధిత మత్స్యకార కుటుంబాలకు వైసీపీ అండగా ఉంటుంది. ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదని మత్స్యకారులు చెబుతున్నారు" అని తెలిపారు

## ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

విజయవంతంగా అధిగమించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. చురుకైన ప్రభుత్వ విధానాలు, వైవిధ్యమైన ఇంధన వనరులు, బలమైన దౌత్య సంబంధాల ద్వారా పౌరులపై ఆర్థిక భారాన్ని చాలావరకు తగ్గించామని తెలిపారు. ఇంధన సంక్షోభం కారణంగా ప్రధాన దేశాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని వెల్లడించారు. ఇంధనం విషయంలో కొన్ని శక్తులు ప్రజల్లో భయాన్ని వ్యాప్తి చేయడంలో నిమగ్నమయ్యాయని విమర్శించారు. రాజకీయ క్రీడలు సాగాయని అన్నారు. కానీ, ప్రజలకు ఉపశమనం కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఆ శక్తుల పథకం పారలేదని, తీవ్ర నిరాశలో కూరుకుపోయాయని ఎద్దేవా చేశారు. సంక్షోభాన్ని మనం అధిగమించిన తీరు చరిత్రలో ఒక అపూర్వమైన అధ్యాయంగా గుర్తుండిపోతుందని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ శనివారం రాజస్థాన్‌లో పర్యటించారు. బలోత్రాలో దేశంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ--పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. పశ్చిమాసియాలో జరిగిన యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని సృష్టించిందని గుర్తుచేశారు.అనేక శక్తివంతమైన దేశాలు ఇంధన కొరతతో సతమతమయ్యాయని అన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, పరిస్థితిని సరిగ్గా అంచనా వేయడం, మన వనరులను సమతుల్యంగా ఉపయోగించడం, దౌత్య బలాన్ని సానుకూలంగా వినియోగించుకోవడం ద్వారా ఈ సవాలును సమర్థంగా ఎదుర్కొన్నామని స్పష్టంచేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీని ఏప్రిల్ 21న మోదీ చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉండగా, 20న జరిగిన అగ్?నప్రమాదం వల్ల వాయిదా పడిన సంగతి తెలిసిందే. రెండు నెలల్లోనే మరమ్మతులు పూర్తి చేసినందుకు అధికారులను మోదీ అభినందించారు. అనేక అభివృద్ధి చెందిన దేశాలు చమురు శుద్ధి సామర్థ్యాన్ని పెంచుకోవడంలో విఫలమైనప్పటికీ.. భారతదేశం మాత్రం ఆ సామర్థ్యాన్ని గణనీయంగా విస్తరింపజేసుకుంది. గత 50 ఏళ్లలో అమెరికా కొత్తగా చమురు శుద్ధి కర్మాగారాన్ని నిర్మించలేదు. ఐరోపా శుద్ధి సామర్థ్యం నానాటికీ తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం అయిల్ రిఫైనరీ సామర్థ్యం పరంగా భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద దేశంగా అవతరించింది. ఈ సామర్థ్యం ఇంకా పెరుగుతూనే ఉంటుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం వల్ల ఏప్రిల్ నుంచి జూన్ మధ్య మన దేశ చమురు కంపెనీలు రూ.75,000 కోట్లకు పైగా నష్టాలను చవిచూశాయి.అయితే, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించింది. ప్రపంచవ్యాప్తంగా చాలాదేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40 నుంచి 50 శాతం వరకు పెరిగాయి. ఇంధనాన్ని కోటా పద్ధతిలో పంపిణీ చేశారు. మన దేశంలో ఒక్కరోజు కూడా అలాంటి పరిస్థితి తలెత్తలేదు. కొందరు మాత్రం చమురు విషయంలో వదంతులు వ్యాప్తి చేశారు. ప్రజలను భయపెట్టారు, రాజకీయ క్రీడలు ఆడారు. కానీ, వారు సఫలం కాలేకపోయారు. సంక్షోభ సమయంలో మనం తీసుకున్న ప్రతి కీలక నిర్ణయం చరిత్రలో భాగం అవుతుంది. భారత్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాంతీయ అనుసంధాన పథకం 'ఉడాన్'తదుపరి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. అలాగే జోధ్‌పూర్ విమానాశ్రయంలో రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త టెరి?మనల్ భవనాన్ని ప్రారంభించారు.

## ఏపీ అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలు సహించరు

మంచిని చెడుగా చూపిస్తే, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సోమవారం నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్లెల సంజీవయ్య హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.వైసీపీ హయాంలో మూసేసిన వీఆర్‌సీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పున: ప్రారంభించామని మంత్రి తెలిపారు. వీఆర్‌సీని తలదన్నేలా మరో 15 హైస్కూల్స్‌ను ఆధునికీకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని స్కూల్స్ సిద్ధం చేస్తామని వెల్లడించారు. వైసీపీ నేతలు వాటిపైనా విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధికోసం, ఉనికి కోసం జగన్ అండ్ కో ఆరోపణలు చేస్తే చెడ్డవారిగా మిగిలిపోతారని హెచ్చరించారు. పరిశుభ్రతతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మంత్రి లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా నెల్లూరులో స్కూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది

పుట్టపర్తి: శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్ సమీపంలోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం సుమారు 300 మంది రైతులతో కలిసి బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి భారీ ర్యాలీగా చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.దాదాపు 16 వేల ఎకరాల భూములకు సంబంధించిన భూ పట్టాల సమస్య 70 ఏళ్ల తరబడి పరిష్కారం కాకపోవడంతో సుమారు 2 వేల నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు వెంటనే భూ పట్టాలు మంజూరు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన విష్ణువర్ధన్ రెడ్డి, గత ప్రభుత్వం రైతుల భూ పట్టాల సమస్యను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 2023 సంవత్సరంలోనే సర్వే చేసి , జిల్లా అధికారులు రికార్డులను పూర్తి చేశారు, కాని రికార్డులు పూర్తి చేసి పట్టాలు పంపిణీ చేయలేదు, దీని కారణంగా సమస్యలు పరిష్కారం కాలేదు ఆయన పేర్కొన్నారు.ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలోని నంబలపూలకుంట ప్రాంతంలో వందలాది మంది రైతులు పట్టాలు లేకుండానే 70 , నుంచి 80 సంవత్సరాల పైబడి భూములను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ మీడియాకు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ రైతుల భూ పట్టాల సమస్యపై త్వరలో సమగ్ర విచారణ నిర్వహించి నిబంధనల ప్రకారం పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి ప్రైవేటు సంస్థలు , కంపెనీల ప్రతినిధులు రైతులకు సంబంధించిన భూముల్లో ప్రవేశించేందుకు అవకాశం ఉండదని, చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# కుప్పం పర్యటన నాకెంతో ఆనందాన్నిచ్చింది

సమావేశమయ్యారు. అలాగే స్థానిక రైతులు, పీ4 లబ్ధిదారులు, పార్టీ నేతలు, అధికారులతోనూ వరుస భేటీలు నిర్వహించారు. ప్రజాసమస్యల పరిష్కారంపై పోలీసులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలాగే క్షేత్రస్థాయి విషయాలు, సమస్యలను త్వరగా పరిష్కరించేలా చూడాలని కోరారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలతో ప్రజలకు ఇబ్బంది ఉంటే.. వాటిని సరిచేసే బాధ్యతను పార్టీ కార్యకర్తలే తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ాా×=)ను సక్రమంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా వైసీపీపై సీఎం ఆలోచనలు చేశారు. గొడ్డలిపార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కుప్పంలో ప్రశాంతతను చెడగొట్టేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించిన ఘటనలను గుర్తు చేశారు. ఆ పార్టీవారు చేసే గొడవలపై వైల్డ్ గా రియాక్ట్ కావొద్దని టీడీపీ నేతలకు సూచించారు.టిబెట్‌కు చెందిన బౌద్ధ మత గురువు దలైలామా జన్మదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు అందజేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా సీఎం ఒక సందేశాన్ని పంచుకున్నారు. దలైలామా నిండు నూరేళ్లూ పూర్తి ఆరోగ్యంతో, సంతోషంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు.ప్రపంచవ్యాప్తంగా శాంతిని స్థాపించడంలో, మానవ హక్కుల రక్షణ కోసం దలైలామా అద్వితీయమైన సేవలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కొనియాడారు. లోకానికి దయ, అహింస, కరుణ వంటి ఉన్నతమైన విలువలను పరిచయం చేస్తూ.. దశాబ్దాలుగా కోట్లాది మందిలో దలైలామా స్ఫూర్తిని నింపుతున్నారని ప్రశంసించారు. సమాజంలో ద్వేషాన్ని వీడి, సోదరభావాన్ని పెంపొందించుకోవాలంటూ దలైలామా ఇచ్చిన సందేశాలు ఎప్పటికీ గుర్తిండిపోతాయన్నారు. ఈ పరమ పూజ్య గురువు గారు ఇలాగే మరిన్ని సంవత్సరాల పాటు సమాజానికి మార్గదర్శనం చేయాలని, ఆయనకు దైవ బలం, దీర్ఘాయుష్షు లభించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్టు తన సందేశంలో పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో జీరో వేస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈరోజు (సోమవారం) రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. విశాఖపట్నం సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏఏ విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఏపీ అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్ – బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారం ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని నిర్దేశించారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో స్పష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని ఆదేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏ మేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లోని టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని డెవలప్ చేసి యాదాద్రి తరహాలో ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో భాగ్యనగరంలో ఎకో పార్కులను తీర్చిదిద్దాలని ఆజ్ఞాపించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాల న్నారు. అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఏర్పాట్లు చేయాలని, ఆ ప్రాజెక్టుల కోసం ప్రత్యేక అధికారిని నియమించి పనులను ముమ్మరం చేయాలన్నారు. పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు.అవకాశం ఉంటే ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలన్నారు ముఖ్యమంత్రి. డిసెంబరులో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పైనా కసరత్తు ప్రారంభించాలని, సమ్మిట్ కోసం శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కాగా, ఈ సమీక్షా సమావేశానికి సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి హాజరయ్యారు.హైదరాబాద్ మెట్రో రైలు తొలి దశ, రెండో దశ ప్రాజెక్టులకి సంబంధించి కీలకమైన నిర్ణయాల అమలులో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుండడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ఆయన లేఖలు రాశారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో గత జూన్ 24న నిర్వహించిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని ఆయన కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. మెట్రో తొలి దశ ప్రాజెక్టు విలువను అంచనా వేయడం, దాని ఆర్థికస్థితిని పరిశీలించడంతో పాటు రెండో దశ ప్రాజెక్టుకి ఆర్థిక వనరులను సమకూర్చుకునే మార్గాలను అన్వేషించే బాధ్యతలను ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్(ఎస్‌బీఐ క్యాప్స్) సంస్థకు బాధ్యతలను అప్పగించాలని ఆ సమావేశంలో నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు.

# గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేసినా అరెస్టులు లేవు..

నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెడతారా? అంటూ సూటిగా ప్రశ్నించారు. విమర్శకులను నేరస్తులుగా చిత్రీకరించడం.. వారిని చంపడం కోసం పోలీస్‌స్టేషన్ల మీదకు మీవారిని పంపి దాడి చేయించడం.. పోలీసులు మౌనం వహించి ప్రేక్షక పాత్ర పోషించడం..! ఇవన్నీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతాలన్నారు. ఇది రాజ్యాంగ హక్కులపై దాడి.. ఇది ప్రజాస్వామ్య విలువలపై దాడి..! అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు కావాల్సింది రౌడీ పోలీస్ రాజ్యం కాదు.. జంగిల్ రాజ్ కాదు.. ప్రజలకు భద్రత కల్పించే పాలన కావాలి.. బాధితులకు న్యాయం చేసే వ్యవస్థ కావాలంటూ సీఎం చంద్రబాబుకు వైఎస్ జగన్ హితవు పలికారు. 'హే రామ్ సేవ్ ఆంధ్రప్రదేశ్..' అంటూ ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ పోస్టు చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే.. చంద్రబాబు గారూ..! రాజకీయ అణచివేత చర్యల కోసం, ప్రశ్నించేవారి గొంతు నొక్కడానికి ఆంధ్రప్రదేశ్‌లో మీరు పోలీస్ వ్యవస్థను అత్యంత ప్రమాదకర ధోరణి వైపు నడిపిస్తున్నారు. మీ పాలనలో పుట్టుకొచ్చిన దుష్ట సంప్రదాయాలతో రాష్ట్రంలో ప్రతిచోటా విషపు విత్తనాలు నాటారు. అవి క్రమంగా మొక్కలై విష వృక్షాలుగా మారుతున్నాయి. చిన్నారులు మిస్సింగ్ అయినా దర్యాప్తులో వేగం లేదు. మహిళలపై నేరాలకు సంబంధించి ఫిర్యాదులు నమోదు కాకపోయినా కదలిక లేదు. గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేసినా అరెస్టులు లేవు. కానీ సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మాత్రం కేసులు, అరెస్టులు, చిత్రహింసలు, నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెడతారా? కాకినాడ జిల్లా తుని నియోజకవర్గానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి కనిపించకుండా పోయి 30 రోజులు దాటిపోయింది. ఇప్పటికీ ఆ పాప ఆచూకీ లేదు. తన కూతురు ఫొటోలు పట్టుకుని ఆ తండ్రి వీధివీధి తిరుగుతున్నాడు. పాప తల్లి ఆ బాధ తట్టుకోలేక తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఒక చిన్నారి ఆచూకీ కనుగొనడంలోనే ప్రభుత్వం విఫలమైతే ఇక ప్రజల భద్రతకు భరోసా ఎలా ఇవ్వగలుగుతారు? ఇంకో ఘటనలో ఇదే కాకినాడ జిల్లా పెద్దాపురంలో మానసిక దివ్యాంగురాలైన బాలికపై లైంగిక దాడి ఘటనపై కేసు నమోదుకు నానా తాత్సారం చేసి నిందితులతో కుమ్మక్కు అయితే ఇక ఈ రాష్ట్రంలో పాలన ఎక్కడుంది? పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో టీడీపీ మాజీ కౌన్సిలర్.. గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేశారన్న ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. ఇలాంటి దారుణ ఘటనలో తాత్సారం చేసి వారం రోజుల తర్వాత ఫిర్యాదు తీసుకోవడం ఒక పెద్ద తప్పు అయితే, ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయకపోవడం మరింత దారుణం. పైగా బాధితులపైనే ఎదురు కేసు పెట్టడం చూస్తే.. నేరస్తులకు రక్షణ, బాధితులకు వేధింపులు అన్నట్టుగా మీరు పోలీసు వ్యవస్థను నడుపుతున్నారు. సాయికృష్ణ లాకప్‌డెత్, శవం మాయం కేసు రాష్ట్రాన్ని కుదిపేసింది. ఆ తల్లి అడిగిన ప్రశ్నలకు మీ వద్ద ఇప్పటికీ సమాధానాలు లేవు. క్రాంతికుమార్ ఆత్మహత్య కేసు, తాను ఇచ్చిన మరణ వాంగ్మూలం, దీన్ని సోషల్ మీడియా సాక్షిగా చూసిన ప్రజలు తీవ్రంగా కలత చెందారు. గంగమ్మ, తిరుపతమ్మల లాకప్‌డెత్, పోలీసుల వేధింపులతో కళావతి ఆత్మహత్య కేసులు.. ఇవన్నీ రాష్ట్రంలో పోలీసు వ్యవస్థకు తీవ్ర తలవంపులు తెచ్చాయి. అయినా, మీ బరి తెగింపునకు కట్టడి లేదు. వీటన్నింటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి రోజుకో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై వాటికి సంబంధించిన సెక్షన్లతో కాకుండా, బెయిల్ రాని సెక్షన్లు పెట్టాలని, కేసులను వ్యవస్థీకృత నేరాలకు లింక్ చేయాలంటూ ఒక ఆర్గనైజ్డ్ క్రిమినల్ మాదిరిగా మీరే ప్రతి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఈ ఆదేశాలు చేరేలా, పోలీసులకు హుకుం జారీ చేసినట్లుగా సమాచారం వస్తోంది. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, భయపెట్టాలనుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అవుతుంది.యూట్యూబ్ ఇన్ఫ్లూయెన్సర్, ఉస్మానియా గోల్డ్‌మెడల్ జర్నలిస్ట్ కేవీఆర్‌ను సరైన చట్ట ప్రక్రియలు పాటించకుండా హైదరాబాద్ నుంచి భారీ పోలీసు బలగాలతో తీసుకురావడం, అతను చేయని వాటిని చేసినట్టుగా ఎఫ్ఐఆర్‌లో పెట్టి, జైలుకు పంపడం అత్యంత దుర్మార్గం. యూట్యూబర్ రావణ్ విషయంలో ఇప్పుడు మీరు పెట్టిన కేసులకు, నాలుగు కోర్టుల్లో బెయిల్స్ వచ్చినా, అహంకారంతో చెలరేగిపోతూ, నేరుగా సంబంధిత పోలీస్‌స్టేషన్లపై తమ వారి చేత దాడులు చేయించారు. అసహనంతో తీవ్రవాదులపై పెట్టే అభియోగాలు మోపారు. అలాంటప్పుడు మరి అవే అభియోగాలు మీ మీద కూడా పెట్టాలి కదా? విమర్శకులను నేరస్తులుగా చిత్రీకరించడం, వారిని చంపడం కోసం పోలీస్‌స్టేషన్ల మీదకు మీవారిని పంపి దాడిచేయించడం, పోలీసులు మౌనం వహించి, ప్రేక్షకు పాత్ర పోషించడం, ఇవన్నీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతాలు.

# ప్రశ్నించే గొంతు నొక్కే కుట్రను వైయస్సార్‌సీపీ సహించదు

దౌర్జన్యకాండ కొనసాగుతో ందని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారిపై వరుసగా అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. అన్యాయంగా, అక్రమంగా కేసులు ఎదుర్కొంటున్న వారికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచి న్యాయపరమైన పోరాటం చేస్తుందని గుంటూరులో మీడియాతో మాట్లాడిన అంబటి రాంబాబు ప్రకటించారు.సోషల్ మీడియా యాక్టివిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ప్రతిపక్ష నాయకులు, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. యూట్యూబర్ ప్రశ్న రావణ్, తెలంగాణ జర్నలిస్టు కేవీఆర్ మా పార్టీకి చెందిన వారు కాకపోయినా.. వారిపై వరుసగా కేసులు పెట్టి అరెస్టులు చేయడం చట్టవిరుద్ధం. తప్పు చేస్తే కోర్టులో నిరూపించాలి తప్ప, కేసుల మీద కేసులు పెట్టి వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.ప్రశ్న రావణ్‌కు పలుమార్లు బెయిల్ వచ్చినా మళ్లీ మళ్లీ అరెస్టు చేయడం అధికార దుర్వినియోగానికి నిదర్శనం. రిమాండ్ ఇవ్వని కోర్టులను దాటేందుకు ఉగ్రవాద నిరోధక చట్టమైన యూఏపీఏ (అన్ లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్)ను ఒక యూట్యూబర్‌పై ప్రయోగించడం న్యాయవ్యవస్థకే సవాల్. మా పార్టీతో సంబంధం లేకపోయినా అన్యాయంగా కేసులు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుంది. ఎవరైనా తప్పు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి కానీ వేధింపుల కోసం చట్టాలను దుర్వినియోగం చేయడం సరికాదు.బాధితులనే నిందితులుగా మార్చే ఈ ధోరణిని వైయస్సార్‌సీపీ సహించదు. అందుకే ఎవరికి అన్యాయం జరిగినా పార్టీలకు అతీతంగా వారి తరపున పోరాడతాం. జనవరి 31న నా ఇంటిపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 29న డీజీపీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేస్తాను. ఈ దుర్మార్గమైన పాలనను ప్రజలు గమనిస్తున్నారు. కాగా, ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రతి చర్యను ప్రజల తరపున వైయస్సార్‌సీపీ ప్రశ్నిస్తూనే ఉంటుందని అంబటి రాంబాబు చెప్పారు.రాజకీయ కక్షలతో ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీ చేస్తుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియా సమావేశం లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసు లు ప్రతిపక్షాలపై కేసులు పెడుతున్నారని.. సోషల్ మీడియా యాక్టివిస్టులను లక్ష్యంగా చేసుకుని వరుస అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు."యూట్యూబర్ ప్రశ్న రావణ్, జర్నలిస్టు కేవీఆర్ మా పార్టీకి చెందినవారు కాకపోయినా వారిపై నమోదు చేసిన అక్రమ కేసులను వ్యతిరేకిస్తున్నాం. తప్పు చేస్తే కోర్టులో నిరూపించాలి. కేసుల మీద కేసులు పెట్టి వేధించడం చట్టవిరుద్ధం.

# ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలు..

తద్వారా లక్ష ఉద్యోగాలు సృష్టించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని లోకేశ్ స్పష్టం చేశారు. సియోల్ బిజినెస్ ఏజెన్సీ (ఎస్‌బీఏ) ఆధ్వర్యంలో కొరియన్ టెక్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.ఏపీలో ఆవిష్కరణలకు వెన్నెముకగా ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) గురించి మంత్రి లోకేశ్ కొరియన్ పారిశ్రామికవేత్తలకు వివరించారు. అమరావతిని ప్రధాన కేంద్రంగా చేసుకుని విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం వంటి నగరాల్లో ప్రాంతీయ కేంద్రాలతో ఈ హబ్ పనిచేస్తోందని తెలిపారు. టాటా, ఎల్‌డటీ, జీఎంఆర్, అదానీ వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో దీనిని ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఆలోచనల రూపకల్పన (స్పార్క్), ఇంక్యుబేషన్ (క్యాటలిస్ట్) వంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కొరియన్ స్టార్టప్‌లను ఆయన ఆహ్వానించారు. ఇప్పటికే ఈ వేదిక ద్వారా 2,500కు పైగా స్టార్టప్‌లకు, 5,200 మందికి పైగా పారిశ్రామికవేత్తలకు మద్దతు అందించినట్లు గుర్తుచేశారు.ఏపీ ఇన్నోవేషన్ ట స్టార్టప్ పాలసీ 2024-29 కింద స్టార్టప్‌లకు అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహకాలను లోకేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రూ. 22 కోట్ల ఆర్‌టీఐహెచ్-ఎస్ఐడీబీఐ సీడ్ ఫండ్, రూ. 20 కోట్ల వరకు ఏఐఎఫ్ సీడ్ ఈక్విటీ, వర్కింగ్ క్యాపిటల్ కోసం క్రెడిట్-గ్యారెంటీ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. సిడ్బీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన కొత్త డీప్-టెక్ ఏంజెల్ ఫండ్ ద్వారా ఏఐ, క్వాంటం వంటి అధునాతన రంగాల్లోని స్టార్టప్‌లకు మరింత ఊతమిస్తామని హామీ ఇచ్చారు. ఇండియా-కొరియా మధ్య ఒక ప్రత్యేక స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని, దీని కోసం ఆర్‌టీఐహెచ్‌లో ప్రత్యేకంగా కొరియా డెస్క్, సాఫ్ట్-ల్యాండింగ్ 'విసి బే' ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు.ఆంధ్రప్రదేశను భారతదేశ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాజధానిగా నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ దిశగా ఇప్పటికే పలు చర్యలు ప్రారంభించామని తెలిపారు. గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు, రిలయన్స్, సిఫీ వంటి సంస్థల ద్వారా 10 గిగావాట్ల డేటా-సెంటర్ పైప్‌లైన్ నిర్మాణం జరుగుతోందని, దీనివల్ల స్టార్టప్‌లకు తక్కువ ధరకే భారీ కంప్యూటింగ్ వనరులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. దేశంలోనే మొట్టమొదటి క్వాంటం ఽ ఏఐ విశ్వవిద్యాలయాన్ని అమరావతి క్వాంటం వ్యాలీలో నెలకొల్పు తున్నట్లు ప్రకటించారు. దీని ద్వారా 133-క్యూబిట్ సామర్థ్యం గల ఐబీఎం క్వాంటం సిస్టమ్, క్వాంటం హార్డ్‌వేర్ పార్క్ అందుబాటులోకి వస్తాయని, ఇది కొరియన్ డీప్-టెక్ స్టార్టప్‌ల పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు.

# 'కాన్పుల మధ్య విరామం.. తల్లీబిడ్డకు క్షేమం'

సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఒక మంత్రిగా... ప్రభుత్వంపై చేసే అర్థరహితమైన విమర్శలను చూస్తూ ఊరుకోను" అని సత్యకుమార్ హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ ను తాను వ్యక్తిగతంగా ఎప్పుడూ దూషించలేదని... ఆయన అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైనే తన పోరాటమని చెప్పారు. జగన్ ఒక నిలకడ లేని మనిషి అని, రాజధాని విషయంలో ఆయన మాట్లాడుతున్న తీరు చూస్తుంటే కనీస అవగాహన లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం చేసి, అతి త్వరలోనే పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యాయని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వ్యవస్థను గాడిలో పెట్టాల్సి ఉందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి చిన్న సమస్య, ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం, అవాంఛిత గర్భధారణలను నివారించడం, కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జూలై 11 నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. 'పిల్లల మధ్య ఎడం పాటిద్దాం.. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం' అనే నినాదంతో ఈసారి ప్రచారం సాగనుంది. గర్భధారణకు సరైన సమయాన్ని ఎంచుకోవడం, కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యానికి మేలు కలుగుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన దంపతులకు నగదు పురస్కారాన్ని అందచేయనున్నామని మంత్రి శ్రీ సత్యకుమార్ తెలిపారు. ప్రతి జిల్లాలో మూడు జంటల(మొత్తం 54 జంటలు)కు రూ.5 వేల చొప్పున నగదును అందచేస్తామని తెలిపారు.కాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్లపాటు ఎడమ పాటించిన దంపతులకు కూడా నగదు పురస్కారాన్ని ఇస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఆరు గంటలకు పై విధంగానే రూ.5వేల చొప్పున నగదు అందచేస్తామని మంత్రి తెలిపారు. ఎక్కువ మంది ఉంటే లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎశీపిక చేస్తామని తెలిపారు.కాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్ల వరకు విరామం పాటిస్తే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విధానాన్ని పాటిస్తే మాతృత్వ మరణాల్లో 30 శాతం, శిశు మరణాల్లో 10 శాతం వరకు తగ్గుతాయని పేర్కొన్నారు. యుక్తవయస్సు గర్భధారణలు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలు, మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ప్రసవానంతరం అమర్చే గర్భనిరోధక సాధనం, 'అంతరా' సూది తదితర పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు. జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## కుంటలో గల్లంతైన యువకుడి మృతదేహం వెలికితీత





ప్యాపిలి, జూలై 7 (సీమ కిరణం న్యూస్) : ప్యాపిలి మండలం నల్లమేకలపల్లి గ్రామానికి చెందిన కురుబ చిన్న నాగన్న (23) మృతదేహం మంగళవారం ఉదయం కుంటలో తేలింది.సోమవారం ఉదయం గొర్రెలను మేతకు తీసుకెళ్లిన చిన్న నాగన్న, కుంటలోకి వెళ్లిన ఒక గొర్రెను తీసుకురావడానికి నీటిలో దిగగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న జలదుర్గం ఎస్సై అనిల్ కుమార్,పోలీసులు సోమవారం సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ చీకటి పడటంతో వాటిని నిలిపివేశారు.మంగళవారం ఉదయం తిరిగి ప్రారంభించిన గాలింపు సమయంలో యువకుడి మృతదేహం కుంటలో తేలినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.యువకుడి మృతితో నల్లమేకలపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి.

## బంజారా "అమృత్" సారాయికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి

### తండాల్లో తయారయ్యే సారాయిని కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రభుత్వం కొనుగోలు చేయాలి

### లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కైలాస్ నాయక్




కర్నూలు ప్రతినిధి, జూలై 06, (సీమకిరణం న్యూస్): తండాల్లో లంబాడీలు సంప్రదాయ పద్ధతిలో తయారు చేసే "అమృత్" సారాయికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చి, కుటీర పరిశ్రమగా గుర్తించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కైలాస్ నాయక్ డిమాండ్ చేశారు. కర్నూలు బిర్లా కాంపౌండ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పపువ్వు, తెల్ల తుమ్మ చెక్క, బెల్లంతో తయారయ్యే ఈ సంప్రదాయ పానీయం వల్ల అనేక గిరిజన కుటుంబాలకు ఉపాధి లభిస్తోందన్నారు. అయితే ఎక్సైజ్ దాడులు, కేసులు, మహిళలపై వేధింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ముడి సరుకులు అందించి, తయారైన "బంజారా అమృత్" సారాయిని ప్రామాణిక కొలతలతో కొనుగోలు చేయాలని కోరారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దీనిని హెరిటేజ్ లిక్కర్‌గా విక్రయిస్తున్నారని పేర్కొంటూ, ఇదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సీనియర్ నేషనల్ వాటర్ పోలోకు కర్నూలు బాలికల ఎంపిక

### ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న ఐదుగురు క్రీడాకారిణులు





కల్లూరు, జూలై 06, (సీమకిరణం న్యూస్): చెన్నైలో జరగనున్న సీనియర్ నేషనల్ వాటర్ పోలో ఛాంపియన్‌షిప్ కోసం ఎంపికైన ఆంధ్రప్రదేశ్ జట్టులో కర్నూలు జిల్లాకు చెందిన ఐదుగురు బాలికలు చోటు దక్కించుకున్నారు. కర్నూలు నుంచి బి. సిరి చేతన రాజ్, కే. శృతి, హేమలత, లహరి, శాన్విత ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం కర్నూలు జిల్లాకు గర్వకారణమని క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులకు వారి కుటుంబ సభ్యులు, కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆంధ్రప్రదేశ్‌కు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ద్రోణాచలం సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధుడికి అంత్యక్రియలు







డోన్ టౌన్, జూలై 06,(సీమ కిరణం న్యూస్): డోన్ టౌన్ టీచర్స్ కాలనీ 21 వ వార్డుకు చెందిన కమ్మరి వీరన్న 92 సంవత్సరాల వృద్ధుడు అనారోగ్యంతో చనిపోగా అదే ఏరియాలో ఉన్న పద్మావతి ఆశ్రమం వారు అతని అంత్యక్రియలు నిర్వహించండి అని ద్రోణాచలం సేవా సమితి వారికి సమీప బంధువులకు సమాచారం తెలియజేయగా అతని బంధువులు సేవా సమితి సహాయం కోరగా స్పందించిన సేవా సైనికులు వీరన్న మృతదేహనికి హిందూ సంప్రదాయ పద్ధతిలో డోన్ హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి అయిన ఖర్చును 21 వ వార్డు కౌన్సిలర్ సాదిక్ అహమ్మద్ భరించారు, వైకుంఠ రథాన్ని రాజయ్య గౌడ్ ఉచితంగా సమకూర్చారు .ఈ కార్యక్రమంలో ద్రోణాచలం సేవా సైనికులు షాది ఖానారాజా,పూలమాబు, తాహర్ భాష,దాదా హుస్సేన్,బ్రహ్మయ్య లు పాల్గొన్నారు.

## డోన్‌లో పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచిత రేబిస్ టీకాలు

### ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశు వైద్యశాలలో ప్రత్యేక శిబిరం





డోన్ ప్రతినిధి, జూలై 06, (సీమకిరణం న్యూస్): ప్రపంచ జూనోసిస్ (జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే అంటువ్యాధులు) దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లా డోన్ పట్టణ ప్రాంతీయ పశు వైద్యశాలలో సోమవారం ఉదయం నుంచి పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచిత రేబిస్ నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ ఆర్. నాగరాజు తెలిపారు. డోన్ పట్టణం, మండల పరిధిలోని గ్రామాల పెంపుడు కుక్కలు, పిల్లుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు. రేబిస్ అత్యంత ప్రమాదకరమైన ప్రాణాంతక అంటువ్యాధి కావడంతో, వ్యాధి నివారణలో టీకా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ప్రతి పెంపుడు జంతువుకు సమయానికి టీకా వేయించడం యజమానుల బాధ్యత అని డాక్టర్ నాగరాజు సూచించారు.

# మూడు నెలలుగా చుక్క నీరు లేదు...

### దాసరిపేట నడిగడ్డ ప్రజల దాహార్తికి పరిష్కారం ఎప్పుడు?

### అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

### - తక్షణమే తాగునీరు అందించాలని విజ్ఞప్తి



వెల్దుర్తి, జూలై 06, (సీమకిరణం న్యూస్): కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలోని దాసరిపేట నడిగడ్డలో గత మూడు నెలలుగా తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం ప్రతిరోజూ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఈ సమస్యపై పంచాయతీ సెక్రటరీకు పలుమార్లు వినతులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. "ఎన్నికల సమయంలో మాత్రమే మా గడప తొక్కిన నాయకులు... ఇప్పుడు మూడు నెలలుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న మా పరిస్థితిని ఎందుకు పట్టించుకోవడం లేదు?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించ లేకపోతే ప్రజాపాలనకు అర్థమేంటని వారు నిలదీశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దాసరిపేట నడిగడ్డలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

## సర్ ప్రత్యేక శిబిరాలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



### పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలి

### డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం







కర్నూలు ప్రతినిధి, జూలై 06 (సీమకిరణం న్యూస్): జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రత్యేక శిబిరాలను కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓర్వకల్లు మండలం నన్నూరు, కల్లూరు మండలం నాగేంద్రనగర్ సచివాలయం-94, వీకర్ సెక్షన్స్ కాలనీ సచివాలయం-97లో ఏర్పాటు చేసిన శిబిరాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సమర్పించే దరఖాస్తులు, ధ్రువపత్రాలను నిబంధనల మేరకు పరిశీలించి వెంటనే సంబంధిత పోర్టల్‌లో డిజిటైజ్ చేసి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు.గ్రామాలు, వార్డులు, కాలనీల్లో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, బీఎల్‌వోలు మరియు ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఫిర్యాదులకు తావులేకుండా సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి బీఎల్‌వోకు సహాయకులుగా ఐసీడీఎస్, మేప్మా, డ్వామా, డీఆర్‌డీఏ శాఖల నుంచి సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొంటూ, వారి సేవలను సమర్థవంతంగా వినియోగించి డిజిటైజేషన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ తనిఖీలలో ఓర్వకల్లు తహసీల్దార్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# 36 ఏళ్ల అక్షర సేవకు ఘన వీడ్కోలు..

### చింతా శ్రీనివాసులు పదవీ విరమణ సన్మానం

### డోన్‌లో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ నేతకు ఘన సత్కారం



డోన్ ప్రతినిధి, జూలై 06, (సీమకిరణం న్యూస్): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేటలో సోషల్ ఉపాధ్యాయుడిగా 36 సంవత్సరాల పాటు సేవలందించిన చింతా శ్రీనివాసులు పదవీ విరమణ సందర్భంగా డోన్‌లోని వెంకటాచలం ఫంక్షన్ హాల్‌లో ఎస్టీయూ డోన్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ టి. సురేష్ బాబు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ టి. సురేష్ బాబు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి అన్నింటికంటే గొప్పదని, శ్రీనివాసులు తన సుదీర్ఘ సేవలో వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఈ. షణ్మూర్తి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో శ్రీనివాసులు ముందుండి పోరాడారని గుర్తుచేశారు. డాక్టర్ చిట్యాల దేవేంద్రప్ప మాట్లాడుతూ, ఆయన శిష్యుల్లో అనేక మంది డాక్టర్లు, ఇంజినీర్లు, న్యాయవాదులుగా ఎదగడం ఆయన సేవలకు నిదర్శనమన్నారు.ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జేఎండీ ఇక్బాల్, రాష్ట్ర కౌన్సిలర్ రమణ మాట్లాడుతూ, గతంలో జరిగిన ఉపాధ్యాయ ఉద్యమాల ఫలితంగానే నేడు ఉపాధ్యాయులకు అనేక సంక్షేమ సౌకర్యాలు అందుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సుంకన్న, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, గోకారి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాం బేగ్, డోన్ మండల అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌తో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాల వివిధ మండలాల ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీనివాసులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# డోన్ లో ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కి నివాళులు



డోన్ టౌన్, జూలై 06,(సీమ కిరణం న్యూస్): భారతరత్న డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ మాట్లాడుతూ, దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశభక్తి, జాతీయవాద భావజాలానికి ఆయన ఒక ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధి, సమైక్యత సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ఆచరణలోకి తీసుకువెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం దేశభక్తి నినాదాల మధ్య ఉత్సాహభరితంగా సాగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ఉశాలక్ష్మి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు బండి కిరణ్, జిల్లా ఐటీ కన్వీనర్ అరబోలు వీరేష్ బాబు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆలా శివప్రకాశ్, పట్టణ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కసాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### ట్రాక్టర్ ఢీకొని యువకుడు అక్కడికక్కడే మృతి.. డ్రైవర్ పరారీ

కర్నూలు క్రైమ్/వెల్దుర్తి, జూలై 06,(సీమకిరణం న్యూస్): కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కసాపురం సమీపంలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గుర్తు తెలియని ట్రాక్టర్ టూ వీలర్‌ను ఢీకొనడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చర్ల కొత్తూరు గ్రామానికి చెందిన చంద్రమోహన్ సోలార్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం బొమ్మిరెడ్డిపల్లెకు పనిమీద వెళ్లిన ఆయన, పని ముగించుకుని మధ్యాహ్నం సుమారు 2 గంటలకు టూ వీలర్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా కసాపురం వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని ట్రాక్టర్ అతని వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన చంద్రమోహన్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు.మృతుడి తల్లి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పరారీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.చంద్రమోహన్ అకాల మరణంతో చర్ల కొత్తూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు.

## ఇమామ్ భాష మొదటి వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం






డోన్ టౌన్, జూలై 06,(సీమ కిరణం న్యూస్): డోన్ పట్టణంలోగత సంవత్సరం పీర్ల పండుగ పెద్ద సరిగెత్తు రోజు ఎన్ హెచ్ హైవే కొత్తపల్లె డాబా సమీపంలో రోడ్డు యాక్సిడెంట్లో మరణించిన ఇమామ్ భాష అలియాస్ సలీం అనే యువకుని ప్రథమ వర్ధంతి సందర్భంగా డోన్ పట్టణం లోని ఫ్రెండ్స్ అండ్ కొత్తపేట అలీ అక్బర్ పీర్ల చావడి కమిటీ టీం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్య క్రమం జరిగింది అన్నదాన కార్యక్ర మంలో పట్టణ వాసులు దాదాపు 400 మంది పాల్గొన్నారు.

# ప్రశ్నించడమూ తప్పేనా!

కడుపులో కత్తెర్లు నోట్ల శెక్కరలు అని పెద్దలు ఉత్తగనే అనలేదు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన తీరే అందుకు సజీవ సాక్ష్యం. ఎన్నికలకు ముందు హస్తం నేతలు తియ్యటి మాటలు చెప్పారు. తాము భూమ్మీద కాదు, మాట మీద నిలబడే మనుషులమని అన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి మరో గ్యారెంటీ కూడా ఇచ్చారు. అదే ప్రజాపాలనలో ఎవ్వరైనా ప్రశ్నించొచ్చని. కానీ, నేడు అవేవీ అమలు కావడం లేదు. కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనే అందుకు రుజువు.ప్రజాపాలనలో ప్రశ్నిస్తే కేసులే కేసులు. 'మాటలు మస్తుగ చెప్తం. కానీ, వాటిని అమలు చేస్తమా? హామీలు అమలు చేయాలని మమ్మల్నే ప్రశ్నిస్తారా? మీరు ప్రశ్నిస్తే మేం ఊరుకుంటమా?' అన్నట్లు ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారశైలి. హస్తం ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపుతూ, ఇదేమిటని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై ఏడాదిలోనే సుమారు 90కి పైగా కేసులు నమోదయ్యాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో నాటి ఉమ్మడి ప్రభుత్వమూ ఇంతలా కేసులు పెట్టలేదు. అంతేకాదు, బీఆర్ఎస్ నాయకులను జైలుకు పంపిస్తామని పాలకులు బాహటంగా చెప్తున్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రితో పోటీపడి మరీ మంత్రులు ప్రకటనలు చేస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ మొన్నటివరకు ప్రజావిజయోత్సవాలు అంటూ హడావుడి చేసింది. కానీ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత ప్రభుత్వాన్ని దూషించని రోజు లేదు. సమయం, సందర్భం లేకుండా విమర్శలు, ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. నాయకుల ఇండ్లలో చిన్న శుభకార్యం జరిగినా కూడా కేసులు పెట్టాలని చూస్తున్నారు. ఏదో సాకుతో ఇరుకునపెట్టి, ఇబ్బందుల పాల్జేయాలనేది ఈ ప్రభుత్వ కుట్రలా అనిపిస్తున్నది. అందులో భాగంగానే రైతుల పక్షాన మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులందరిపై కేసులు నమోదు చేశారు. మొన్నటివరకు హరీశ్‌రావుపై కేసులంటూ లీకులిచ్చారు. ఇప్పుడు కేటీఆర్‌పై విచారణ అంటూ హంగామా చేస్తున్నారు. ఇక జైలుకు వెళ్లడం ఖాయమంటూ కాంగ్రెస్ నేతలు జోస్యం చెప్తున్నారు. వారిట్లా చెప్పడం పోలీసులు కేసులు నమోదు చేయడం వెంటవెంటనే జరిగిపోతున్నాయి.తమది ప్రజాపాలన అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా రాజ్యాంగస్ఫూర్తిని ఉల్లంఘిస్తున్నారు. పైగా నిత్యం నీతులు చెప్తున్నారు. ఆర్టికల్ 19 ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛ బహిరంగంగా ఉల్లంఘనలకు గురవుతూనే ఉన్నది. అంతేకాదు, ఆర్టికల్ 14 కూడా దుర్వినియోగం అవుతున్నది. గౌరవంగా, భద్రంగా జీవించే హక్కును మన రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించింది. అయినప్పటికీ, హైడ్రా పేరుతో ప్రజల ఆస్తులను ధ్వంసం చేశారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే ఇలా చేస్తే ఎవరికి చెప్పుకోవాలి? ఆర్టికల్ 21 ప్రసాదించిన జీవించే హక్కును కూడా కాలరాశారు. లగచర్ల ఘటనే అందుకు నిదర్శనం. ఓటేసిన పాపానికి తాము ఇన్ని ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బతకాల్సి వస్తోందని అక్కడి ప్రజలు మీడియా ముఖంగానే చెప్పిన విషయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉన్నది.ఇక ఈ ఏడాది పాలనలో ప్రభుత్వ పెద్దలు మాట్లాడిన భాష గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దుర్భాషా దుర్గంధాన్ని తెలంగాణ ప్రజలు భరిస్తున్నారనే విషయం తేటతెల్లం అయింది. కండ్లు పీకుత, కడుపుల పేగులు తీస్త, కనుగుడ్లతో గోటీలాడుకుంట.. ఈ తరహా భాష సచివుల నోటి నుంచి వచ్చింది. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కంటే విపక్షంపై దుమ్మెత్తిపోయడమే ప్రధాన ఎజెండాగా ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తున్నది. అందుకే సమయం, సందర్భం లేకుండా గత ప్రభుత్వ పెద్దలపై దుమ్మెత్తిపోస్తున్నారు. వారి వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూస్తున్నారు. మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు.ఏడాదిలోనే కాంగ్రెస్ సర్కార్ చేసిన అప్పులు లక్ష కోట్లను మించిపోయాయి. ఇప్పటివరకు ఒక్క కొత్త పథకమూ ప్రకటించలేదు. పాత వాటికి నిధులు కేటాయించడం లేదు. ఉద్యోగ, ఉపాధి కల్పించకుండా వందల కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి మీడియాలో ప్రకటనలు ఇచ్చుకుంటున్నారు. తమ డబ్బా తామే కొట్టుకుంటున్నారు. అంతేతప్ప, పేదల గురించి పాలకులకు సోయి లేదు. ఈ పాలనలో తెలంగాణ సోయి లేదు. తెలంగాణ ఆత్మ లేదు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం ఇసుమంత కూడా లేదని ప్రజలు బాహాటంగా చెప్తున్నారు. కరెంటు, నీళ్లు, ఎరువులు, విత్తనాలు, రైతులకు మద్దతు ధర తదితర అంశాల్లో గడిచిన పదేళ్లలో వచ్చిన మార్పును ప్రజలు గమనించారు. ప్రభుత్వం మారగానే మళ్లీ తమకు మునుపటి కష్టాలు వస్తున్నాయని వేదన చెందుతున్నారు. ప్రజాపాలన అని చెప్తున్నారు కానీ, అక్కడ ప్రజలు లేరు, ప్రజల అభీష్టం అసలే లేదు. కేవలం తామే అన్న రీతిలో జరుగుతున్న పాలన ఉందనేది ప్రజల అనుభవం చెప్తున్న విషయం. మొత్తంగా చెప్పాలంటే కాంగ్రెస్ పాలనలో ప్రజల జీవించే హక్కు, వాక్ స్వాతంత్ర్యపు హక్కు హరించబడుతున్నాయని మాత్రం చెప్పక తప్పదు.

# క్షణకాల తప్పు.. యుగయుగాలకూ శిక్ష



'లంహోమె ఇతాయెకీ సదియోంమె సజాపాయి'.. క్షణకాలంలో చేసిన తప్పులకు యుగయుగాలు శిక్ష అనుభవించవలసి వస్తుందని దీనర్థం. ఇది ఒక ఉర్దూ నానుడి. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్న కష్టాలకు ఈ నానుడి అద్దం పడుతుంది. దశాబ్దాల పాటు పోరాటాలు, ప్రాణ త్యాగాలతో తెలంగాణ ప్రజలు స్వీయ అస్తిత్వాన్ని సాధించుకున్నారు. కానీ, గత అసెంబ్లీ ఎన్నికల్లో క్షణికావేశానికి లోనై చేసిన పనికి తన జీవితంలో ఒక్కసారైనా 'జై తెలంగాణ' అనని వ్యక్తిని రాష్ట్ర అత్యున్నత అధికార పీఠంపై కూర్చోబెట్టారు. దాని పర్యవసానంగా నేడు తెలంగాణ స్వీయ అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలు ప్రమాదంలో పడ్డాయి.రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని శపథాలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణ సాంస్కృతిక, అస్తిత్వ చిహ్నాలను గుట్టుగా చెరిపివేసే కుట్రకు తెరలేపారు. కేసీఆర్ ముఖ్యమంత్రి పీఠం దిగిపోయిన నాడు ఆంధ్రా పోలీసులు శ్రీశైలం ప్రాజెక్టును కబ్జాపెట్టడంతో మొదలైన ఈ అస్తిత్వ హననం నేటికీ కొనసాగుతున్నది. ఈ ఏడాది వర్షాకాలం తర్వాత శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి పోతిరెడ్డిపాడు, సాగర్ కుడి కాల్వ ద్వారా ఏపీ ప్రభుత్వం సుమారు 400 టీఎంసీల నీటిని తరలించుపోయింది. అప్పుడు చేష్టలుడిగిన రేవంత్ సర్కార్ తన తెలివినంతా తెలంగాణ అస్తిత్వ చిహ్నాల మార్పుచేర్పులకు, తన శక్తియుక్తులను ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేసి, వారిని నిర్బంధించడానికి వాడుతూ తెలంగాణ రైతుల అస్తిత్వాన్ని సంక్షోభంలో నెట్టివేసింది.సీఎం రేవంత్ రెడ్డి అల్లుడి ద్వారా తెలంగాణ సచివాలయంలో చొరబడ్డ ఆంధ్రా పైరవీకారులతో రాష్ట్రస్థాయి కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. ఈ చొరబాటు కేవలం పైరవీకారుల వరకే పరిమితం కాలేదు. రాష్ట్రస్థాయి కీలక పదవులు కూడా చాలా వరకు ఏపీ అధికారులతో నింపుతూ పోతున్నారు. బుద్ధవనం ప్రాజెక్టు పర్యవేక్షకుడిగా మాజీ ఐపీఎస్ అధికారి ఆంజనేయరెడ్డిని, రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారుడిగా ఏపీ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను, ఏపీకి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్‌రాజును తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడిగా, అ య్యదేవర ప్రసన్నకుమార్‌ను అసెంబ్లీ సలహాదారుడిగా, రెడ్కో ఎండీగా అనంతపురానికి చెందిన అని ల వావిల్లను, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్ జనరల్‌గా నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌లను నియమించడం లాంటివి చూస్తుంటే మళ్లీ 'మా ఉద్యోగాలు మాకు కావాలి' అని తెలంగాణ ఉద్యోగులు ఉద్యమాలు చేయాల్సి వస్తుందేమోనని అనిపిస్తున్నది.తెలంగాణ అధికార చిహ్నం నుంచి ఘనమైన గత చరిత్రకు ఆనవాళ్లయిన చార్మినార్, కాకతీయ కళాతోరణాలను తొలగించే ప్రయత్నం చేసిన రేవంత్ భంగపడ్డారు. ప్రజాగ్రహాన్ని చూసి భయపడ్డారో లేక అధికార చిహ్నాల చట్టం ప్రకారం కేంద్రప్రభుత్వానికి మాత్రమే మార్పుచేర్పులు చేసే అధికారం ఉన్నదనో తెలియదు కానీ, గత కొద్ది రోజులుగా ఆ విషయాన్ని పక్కనపెట్టారు. ఉద్యమ సమయంలో ఎంతోమంది శిల్పులు, చరిత్రకారులు, ఉద్యమకారులు సమాలోచనలు చేసి మన సంప్రదాయం ప్రకారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు. నరనరాన తెలంగాణ వ్యతిరేకత ఉన్న ముఖ్యమంత్రికి ఆ విగ్రహం నచ్చకపోవడంలో వింతేమీ లేదు. తెలంగాణ తల్లి విగ్రహం ఎమ్మెల్సీ కవితలా ఉన్నదని ఒక మంత్రి సెలవిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ అభివృద్ధి పనిలో చూసినా, ఏ సంక్షేమ పథకంలో చూసినా కాంగ్రెస్ నాయకులకు కేసీఆరే కనిపిస్తున్నారు.ప్రతి నీటి ప్రాజెక్టులో హరీశ్‌రావు కనిపిస్తున్నారు. ఐటీ అభివృద్ధిలో కేటీఆర్ కనిపిస్తున్నారు. ఇప్పుడు మంత్రులకు తెలంగాణ తల్లి విగ్రహంలో కవిత కనిపించడం ఆశ్చర్యకరమేమీ కాదు. హైదరాబాద్‌లో తెలంగాణ కొత్త తల్లిని ప్రతిష్ఠించారు. మరి తెలంగాణలోని పల్లెలు, పట్టణాల్లో ఉన్న వేల తెలంగాణ తల్లి విగ్రహాలను ఏం చేస్తారో కూడా ప్రభుత్వ పెద్దలు చెప్పాల్సిన అవసరం ఉన్నది. కేసీఆర్ మీద అక్కసుతో కొత్త తల్లిని ప్రతిష్ఠించవచ్చు. కానీ, గత 18 ఏండ్లుగా తెలంగాణలోని ప్రతి బిడ్డ మనసులో నాటుకున్న అసలు తెలంగాణ తల్లి రూపాన్ని చెరిపేయడం సాధ్యం కాదన్న విషయాన్ని అస్తిత్వ హననకర్తలు గుర్తిస్తే బాగుంటుంది. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ లేకుండా, కొత్త తెలంగాణ తల్లిని తయారు చేసి మన అస్తిత్వాన్ని కబళించే వికృత క్రీడను కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి ప్రజాక్షేత్రంలో అభాసుపాలు కాకతప్పదు.ఈ ఏడాది కాలంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు తప్ప ఒక్క కొత్త పథకానికి శంకుస్థాపన చేయలేదు. 'టీఎస్'ను 'టీజీ'గా మార్చడం, తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం తప్ప ప్రజల బతుకు మార్చేందుకు ముఖ్యమంత్రి ఏమీ చేయలేదన్నది నగ్నసత్యం.అధికారంలోకి వచ్చిన కొత్తలోనే మోదీ ముందు మోకరిల్లి, బడేభాయ్ అని చెప్పిన రేవంత్.. అనేక రంగాల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉండి ఎన్నో అవార్డులు అందుకున్న తెలంగాణ మాడల్‌ను కాదని గుజరాత్‌లాగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిననాడే తెలంగాణ అస్తిత్వంపై దాడి మొదలుపెట్టారు. గత 10 ఏండ్లలో రాష్ట్రంలో అడుగుపెట్టని అదానీకి ఎర్రతివాచీ పరిచి తెలంగాణ పరువును గుజరాత్‌కు తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.చరిత్రకు చెదలు పట్టదు. చెరిపేస్తే కేసీఆర్ లాంటి చరితార్థుల చరిత్ర చెదిరిపోదు. తుగ్లక్ తన రాజధానిని ఢిల్లీ నుంచి దౌలతాబాద్‌కు మార్చి పిచ్చి తుగ్లక్‌గా పేరుపొందాడు. అలాగే ఇలాంటి నిర్ణయాల వల్ల పాలకులకే నష్టమన్న సంగతిని గ్రహించాలి. ఇప్పటికైనా ప్రజల జీవన ప్రమాణాలు, వారి స్థితిగతులను మార్చే ప్రయత్నం చేయాలి. వ్యక్తిగత కక్షల కోసం తెలంగాణ అస్తిత్వ చిహ్నాలను మార్చే ప్రయత్నం చేస్తే చరిత్రలో పిచ్చి తుగ్లక్‌లుగా నిలిచిపోవడం ఖాయం.

# కలికాలం! ఇది కృత్రిమ మేధ యుగం!!


బీబీసీ కథనం ప్రకారం భారత సంతతికి చెందిన 26 సంవత్సరాల సుచిర్ బాలాజీ అనే యువ శాస్త్రవేత్త, కృత్రిమ మేధస్సుకు చెందిన 'ఓపెన్ ఏఐ' సంస్థ పరిశోధకుడిగా పనిచేస్తూ, 'విజిల్ బ్లోయర్'గా మారిన నేపథ్యంలో, శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో హతాన్మరణం చెందాడని తెలుస్తోంది. 'ఓపెన్ ఏఐ కృత్రిమ మేధస్సు సంస్థ' అనుసరిస్తున్న ఆక్షేపణీయ విధానాలను ఆయన బహిరంగంగా విమర్శించడమే బహుశా ఆయన 'బలవన్మరణానికి' దారితీసి ఉండవచ్చని మీడియా వర్గాల అభిప్రాయం. కొన్నాళ్ల క్రితం సుచిర్‌తో 'న్యూయార్క్ టైమ్స్' జరిపిన ఇంటర్వ్యూలో, కృత్రిమ మేధస్సుకు సంబంధించి ఆయన తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించారు. ఈ సాంకేతికత వల్ల సమాజానికి వాటిల్లే ప్రమాదాలపై తన ఆందోళనను బహిరంగంగా వ్యక్తం చేశారు.కాపీరైట్ చట్టం కింద పరిగణించాల్సిన సమాచారాన్ని, 'ఓపెన్ ఏఐ సంస్థ' చట్టవిరుద్ధంగా, విచ్చలవిడిగా అనైతికంగా, అక్రమంగా, అసురక్షితంగా, మోసపూరితంగా, ఉపయోగించడాన్ని సుచిర్ తప్పుబడుతూ, తీవ్రంగా విమర్శించారు. 'చాట్‌జీపీటీ' లాంటి కృత్రిమ మేధస్సు ఏజెంట్లు, అంతర్జాలాన్ని హానికరంగా మార్చివేస్తున్నాయని ఆయన సుస్పష్టం చేశారు. లింక్డ్ఇన్ ప్రొఫైల్ ప్రకారం, సుచిర్ బాలాజీ, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ చదివాడు. నవంబర్ 2020 నుంచి ఆగస్టు 2024 వరకు, నాలుగేళ్లపాటు 'ఓపెన్ఏఐ సంస్థ'లో పనిచేశారు. సుచిర్ బాలాజీ ధర్మాగ్రహం వర్తమానంలో, సమీప భవిష్యత్తులో 'కృత్రిమ మేధస్సు' కలిగించే 'హానికర ఫలితాల' సంకేతమని నిస్సందేహంగా చెప్పవచ్చు. 'అధికారం, ఆధిపత్యం, అభివృద్ధి' అనే అసంబద్ధమైన నెపంతో, నేడు అధునాతన సాంకేతికతల నిపుణులు తమ శక్తి-యుక్తులు ఉపయోగించి, సృష్టించిన ఒక వికారమైన విజ్ఞానానికి 'కృత్రిమ మేధస్సు (ఏఐ)' అనే నాగరిక నామకరణం చేశారు. అయితే, దీని సంతానం, తరచుగా, వారికి తెలియకుండా, హద్దులు మీరి, పగ్గాలు విదిలించుకుని, వారి నియంత్రణకు అతీతంగా మారాయి, మారుతున్నాయి, భవిష్యత్తులో మారనున్నాయి.అశోకుడు కళింగ యుద్ధం బీభత్సాన్ని చూసి శాంతి మార్గం అనుసరించాడు, బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. రాబర్ట్ ఓపెన్‌హైమర్ అణుబాంబు అనివార్య దుష్ఫలితాలను సహించలేకపోయాడు. కృత్రిమ మేధ సృష్టికర్తలలో ఒకరైన జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్ ఆ వినూత్న సాంకేతికత అనియంత్రిత ఆవిష్కరణల ప్రమాదాలపై ప్రపంచాన్ని గట్టిగా హెచ్చరిస్తున్నారు. బహుశా సుచిర్ బాలాజీ కూడా అదే ప్రయత్నం చేసి మృత్యుబారిన పడ్డాడేమో? కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రగామి శాస్త్రవేత్తలు జెఫ్రీ హింటన్, డెమిస్ హసాబిస్, జాన్ ఎం జంపర్, జాన్ హాప్‌ఫీల్డ్ 2024 సంవత్సరానికి గాను, నోబెల్ బహుమతులు పొందినవారిలో ఉన్నారు.హింటన్, హాప్‌ఫీల్డ్‌లు తమ కృషి ద్వారా 'గణిత, భౌతిక శాస్త్రాల' మధ్య ఒక వంతెనగా కృత్రిమ మేధస్సును సృష్టించారు. దీనివల్ల తాత్త్విక అన్వేషణకు, వ్యావహారిక ప్రయోగాలకు, కావాల్సిన ఉపకరణాల రూపకల్పన జరిగింది. అలాగే డెమిస్ హసాబిస్, జాన్ జంపర్ 'ఆల్ఫాఫోల్డ్' అనే ఏఐ వ్యవస్థ రూపకల్పన చేసి అభివృద్ధి పరిచారు. ఇది ప్రోటీన్ నిర్మాణాలను విశ్లేషించడంలో గణనీయమైన రీతిలో, విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. అమినో ఆమ్లక్రమాల ఆధారంగా ప్రోటీన్‌లో పరమాణు నిర్మాణాన్ని కనుగొనే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇది జీవ, వైద్య శాస్త్రరంగాల్లో విప్లవాత్మక ఫలితాలను చూపింది. ముఖ్యంగా ఔషధాల అభివృద్ధి వేగవంతం చేయడం, రోగాలను అణు స్థాయిలో అర్థం చేసుకోవడం, యాంటీబయోటిక్ నిరోధకత వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో సహాయపడింది.'ఏఐ డీప్‌లెర్నింగ్ గాడ్‌ఫాదర్'గా పిలవబడే జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్, జాన్ హాప్‌ఫీల్డ్‌తో కలిసి 'న్యూరల్ నెట్‌వర్క్'ను రూపొందించారు, ఇది 'బ్యాక్‌ప్రొపగేషన్ ఆల్గారిథమ్' అనే విశిష్ట ప్రక్రియ ద్వారా తప్పుల నుండి నేర్చుకోవడం సాధ్యమైంది. దీని ద్వారా ఆధునిక డీప్‌లెర్నింగ్‌కి బలమైన పునాది ఏర్పడింది. ఈ ఆవిష్కరణ కంప్యూటర్ విజన్ నుండి భాషా ప్రక్రియల వరకు వివిధ ఏఐ అనువర్తనాల్లో ప్రధాన పాత్ర పోషించింది. ఇంగ్లాండ్‌లో జన్మించిన హింటన్, ఎడింబరో విశ్వవిద్యాలయానికి సమర్పించిన పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసంలో 'న్యూరల్ నెట్‌వర్క్‌లో ఎర్రర్ కరెక్టింగ్ కోడ్స్, డిస్ట్రిబ్యూటెడ్ రిప్రజెంటేషన్స్'పై దృష్టిపెట్టారు. ఆయన ఆధారభూత పనితనం కృత్రిమ మేధస్సు దిశను పూర్తిగా మార్చివేసింది. నోబెల్ బహుమతి అందుకున్నప్పటికీ, హింటన్ నిరంతరం ఏఐతో సంభావ్య భావి ప్రమాదాల గురించి హెచ్చరిస్తూ వస్తున్నారు.2023లో గూగుల్‌ను వదిలి, హింటన్ 'అనియంత్రిత కృత్రిమ మేధస్సు అభివృద్ధి' కలిగించే ప్రమాదాలు, తప్పుడు సమాచారం వ్యాప్తి, మానవాళికి కలిగే ముప్పు గురించి తన ఆందోళనలను బహిరంగంగా వ్యక్తం చేశారు. హింటన్, హాప్‌ఫీల్డ్‌లకు లభించిన గుర్తింపు, కృత్రిమ మేధస్సుకు సంబంధించిన పలురంగాల్లో మార్గదర్శక ప్రభావాన్ని చూపిస్తుంది. డీప్‌లెర్నింగ్ ప్రధాన భూమికలైన సిద్ధాంతపరమైన ఆల్గారిథమిక్ మౌలికాలను హింటన్, హాప్‌ఫీల్డ్‌లు అందించగా, హస్సాబిస్, జంపర్‌లు శాస్త్రీయ సవాళ్లను పరిష్కరించగల కృత్రిమ మేధస్సు సామర్థ్యాన్ని శాస్త్రీయంగా రూఢిపరుస్తూ నిరూపించారు. ఈ విజయాలు కృత్రిమ మేధస్సు ద్వంద్వ స్వభావాన్ని కూడా పునరుద్ఘాటించాయి. సమాజానికి కలిగించే ప్రయోజనాలు చాలా ఉన్నప్పటికీ, దాని నైతిక, తదితర అస్తిత్వసంబంధ సమస్యలు గణనీయమైనవిగా మిగిలిపోతున్నాయి. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) ఆవిర్భావం, అవసరం, సిద్ధాంతం, పరిణామం, ఆరోహణ, (బహుశా) అవరోహణ, మంచి-చెడు ప్రభావాలు నిజంగా ఆసక్తికరమైనవేనని అనాలి. 1956లో, న్యూ హ్యాంప్‌షైర్‌లో జరిగిన డార్ట్‌మౌత్ వర్క్‌షాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే పదం సృష్టించబడింది. క్లాడ్ షానన్, జాన్ మక్కార్తీ, నాథనియల్ రోచెస్టర్, మార్విన్ మిన్స్కీలను (ఏఐ) 'కృత్రిమ మేధస్సు స్థాపక పితామహులుగా' పరిగణిస్తారు.అనేక రకాల పనులను ఆటోమేట్ చేయాలని, సామర్థ్యాన్ని పెంచాలని, మానవ మేధో సామర్థ్యాలను మించిపోయే సంక్లిష్టతలను ఎదుర్కొనాలనే మానవ జాతి ఆకాంక్ష నుండి ఆవిర్భవించినదే కృత్రిమ మేధస్సు. కృత్రిమ మేధస్సు పరిణామ క్రమంలో ముఖ్యమైన మైలురాళ్లున్నాయి. వాటిలో 'చాట్‌జిపిటి' వంటి సంభాషణల ఏజెంట్ల రంగప్రవేశం, కృత్రిమ మేధస్సును ఒక 'అత్యవసర దుష్టశక్తి'గా మార్చివేసి, మానవ జీవితంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తూ, మానవ మెదడు ఆలోచనా సామర్థ్యాన్ని దెబ్బతీస్తూ, పర్యవేక్షణ వ్యవస్థలలాంటి ఉపయోగంతో పౌర స్వేచ్ఛలను హరించివేస్తోంది. ఫలితంగా, కృత్రిమ మేధస్సు, ఆధునిక ఆవిష్కరణల ప్రమాదాలను సూచిస్తుంది, కాబట్టి, దాని రూపాంతర సామర్థ్యాన్ని చెడుగా వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవడం అనేది ఒక సవాలుగా మారింది. 'మొట్ట మొదటి అణ్వాయుధ ఆవిర్భావం, ప్రయోగం, దాని అనుకూల, ప్రతికూల ప్రభావాలు, వాటి మధ్య చోటుచేసుకున్న తేడాలను కూలంకషంగా పరిశీలించడం అవశ్యం.రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో, అప్పటి అమెరికా ప్రభుత్వం గోప్యంగా చేపట్టిన 'మాన్‌హట్టన్ ప్రాజెక్ట్'లో భాగంగా ప్రపంచంలో మొదటిసారిగా 'అణ్వాయుధ పరీక్ష' జూలై 16, 1945న 'ది గ్యాడ్జెట్' పేరిట జరిగింది. ఈ పరికరాన్ని న్యూమెక్సికోలోని లాస్ ఆలమోస్‌లో విజయవంతంగా పరీక్షించారు.అమెరికా బాంబర్ 'ఎనోలా గే' వాయునౌక ద్వారా పేల్చబడిన అణ్వాయుధాలు కనీ-వినీ ఎరుగని అపార విధ్వంసాన్ని కలిగించాయి. ఈ విధ్వంసాన్ని చూసిన 'అణ్వాయుధ, ఆటామిక్ బాంబ్ పిత'గా పిలువబడే రాబర్ట్ ఓపెన్‌హైమర్, తన ప్రగాఢ పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేశారు. భగవద్గీతలోని మాటలను ఆయన పదేపదే ఉటంకిస్తూ, 'ఇప్పుడు నేనే మరణాన్నిబీ ప్రపంచాలను నాశనం చేసేవాడిని అయ్యాను' అని ఆవేదనాభరితంగా తన మనస్తాపాన్ని వ్యక్తపరిచాడు.మౌర్య అశోకుడిలో కలిగిన పరివర్తన, రాబర్ట్ ఓపెన్‌హైమర్ పశ్చాత్తాపం, జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్ ఆవేదనలకు బహువిధ సామీప్యాలు ఉన్నాయి. కళింగ యుద్ధంలో విధ్వంసాన్ని చూసి చలించిన అశోకుడు హింసను త్యజించి, బౌద్ధమతాన్ని స్వీకరించారు. ప్రజల శ్రేయస్సుకు కట్టుబడి శాంతి పరిపాలనకు అంకితమయ్యారు. ఓపెన్‌హైమర్, 'మాన్‌హట్టన్ ప్రాజెక్ట్' శాస్త్రీయ డైరెక్టర్‌గా అణుబాంబు సృష్టిలో కీలకపాత్ర పోషించి, ఆ బాంబు ప్రభావానికి బాధపడ్డారు. ఆయుధ నియంత్రణను సమర్థిస్తూ, తన పనికి పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. అలాగే, కృత్రిమ మేధస్సు అభివృద్ధికి 'గాడ్‌ఫాదర్'గా ప్రఖ్యాతిగాంచిన జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్, న్యూరల్ నెట్వర్క్‌ల అభివృద్ధికి కారణమై, ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి కారకుడైనప్పటికీ, కృత్రిమ మేధస్సు అనూహ్య దుష్ఫలితాల గురించి, అది ఆర్థిక వ్యవస్థలపై, సమాజాలపై, మానవ స్వయంశక్తిపై కలిగించే ప్రభావాల గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మానవ మేధో సృష్టి ఫలితాలను అవగాహన చేసుకోవడంలోనే నిజమైన విజ్ఞానం ఇమిడి ఉంటుంది. శాస్త్రవేత్తల సృష్టి పర్యవసానంగా జరిగే అనర్థానికి దాని కారకులు పశ్చాత్తాపం వెల్లడి చేయడం, మార్పు దిశగా ఒక సంకేతమని, ప్రపంచాన్ని బాధ్యతాయుతమైన భవిష్యత్తు వైపు తీసుకెళ్లగలదని భావించాలి. అశోకుడు, ఓపెన్‌హైమర్, హింటన్, లాంటివారి అనుభవాలు, ఆవేదనల నుండి, ఇటీవలే మరణించిన 26 సంవత్సరాల సుచిర్ బాలాజీ హెచ్చరిక నుండి నేర్చుకోవడం ప్రపంచానికి, మానవాళికి ప్రయోజనకరం.

# చర్చ అంటే భయమెందుకు?



ఫార్ములా- ఈ రేస్ విషయంలో తనపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరైన సందర్భంలో, సరైన రీతిలో స్పందించారు. స్పందించడమే కాదు, ఏకంగా చర్చ పెట్టాలని స్పీకర్‌కు లేఖ రాసి విజ్ఞప్తి చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత ఇరుకున పెట్టారు. అంతేకాదు, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి కాబట్టి, సభలోనే చర్చ పెట్టాలని సీఎం రేవంత్‌కు బహిరంగంగా సవాల్ విసరడం మరో డేరింగ్ స్టెప్. బహుశా కేటీఆర్ నుంచి ఇలాంటి సవాల్ వస్తుందని కాంగ్రెస్ పార్టీ గాని, రేవంత్‌రెడ్డి అండ్ కోటరీ గాని ఊహించలేదేమో.కేటీఆర్ సవాల్‌తో ఇప్పుడు కాంగ్రెస్‌లో కొత్త టెన్షన్ మొదలైంది. అసలే ఏడాదిగా అధికార పార్టీ అనేక ఇబ్బందులు పడుతోంది. ప్రభుత్వ వ్యూహాలన్నీ బూమరాంగ్ అవుతున్నాయి. ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడంలో అధికార కాంగ్రెస్ విఫలమవుతోంది. ఇదెవరో గాలినపోయే గన్నారావు చెబుతున్న మాటలు కావు, ఏకంగా తెలంగాణలో ఏఐసీసీ ఇన్‌చార్జీ, హైకమాండ్ దూత అయిన దీపాదాస్ మున్షీ అనేక సందర్భాల్లో చెప్పిన మాటలివి. నిన్నటికి నిన్న హైదరాబాద్‌లో కాంగ్రెస్ పరిస్థితి మరీ దయనీయంగా ఉందని.. కేటీఆర్, హరీశ్‌రావును దీటుగా ఎదుర్కొనే నాయకుడు కాంగ్రెస్‌లో లేడని ఆమె కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అంతేకాదు, హైదరాబాద్ ప్రజలను, వారి ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడారు. అది వేరే సంగతి. అంతకుముందు ఢిల్లీ నుంచి వచ్చి రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే క్రమంలో కాంగ్రెస్ ఎ లా వెనుకబడి పోతోందో వర్క్‌షాప్ పెట్టి మరీ చెప్పారు.ప్రజల దృష్టిలో విపక్షాలను విలన్లుగా, విఫల నేతలుగా చిత్రీకరించే ప్రయత్నంలో అధికార పార్టీ నేతలే విలన్లుగా మిగిలిపోతున్నారు. ఈ అంశం, ఆ అంశం అన్న తేడా లేకుండా ప్రతి విషయంలోనూ అధికార పార్టీపై ప్రతిపక్షం పైచెయ్యి సాధిస్తోంది. ఇప్పుడు ఫార్ములా- ఈ రేస్ విషయంలో కేటీఆర్‌ను కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా చేసుకున్నది. కానీ, జరుగుతున్న పరిణామాలు గమనిస్తే మళ్లీ ఆ పార్టీకి చుక్కెదురు అవుతుందనిపిస్తోంది. కాళేశ్వరం, విద్యుత్ ఒప్పందాల అంశంలో కేసీఆర్‌ను టార్గెట్ చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఫార్ములా-ఈ రేస్ విషయంలో కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని చేతులు కాల్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఫార్ములా- ఈ రేస్‌లో అవినీతి జరిగిందని, అందులో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హస్తం ఉందని ఎప్పటినుంచో కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. లీక్ వార్తలతో ప్రాపగాండా చేస్తోంది. ఇదిగో కేటీఆర్ అరెస్టు, అదిగో అంటూ కొన్ని నెలలుగా పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తోంది.అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం ఆనవాళ్లు లేకుండా చేస్తానని, కేసీఆర్ గుర్తులు లేకుండా చేస్తానని రేవంత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ క్రమంలోనే మొదటి ఏడాది గత ప్రభుత్వాన్ని ప్రజలకు దగ్గర చేసిన పథకాలపై విష ప్రచారం, తప్పుడు ఆరోపణలు చేసి అరెస్టులంటూ ఊదరగొట్టారు. ఆ ప్రయత్నాలన్నీ బూమరాంగ్ కావడమే కాదు, మళ్లీ కేసీఆర్ పాలన కావాలని ప్రజలు బలంగా కోరుకునేలా చేశాయి. ఇప్పుడేమో పర్సనల్‌గా కేటీఆర్‌ను టార్గెట్ చేశారు.అయితే తాజాగా ఫార్ములా- ఈ రేస్ కేసు విషయమై కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం, మంత్రులపై ఇంటాబయట కేటీఆర్ పోరు ఎక్కువైంది. ఆ ఫ్రస్టేషన్ ముఖ్యమంత్రి, మంత్రులు మాటల్లో అనేక సందర్భాల్లో బయటపడుతూనే ఉంది. ఒకవైపు ఇంటి పోరు, మరోవైపు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయాలని ప్రజల నుంచి వస్తున్న ఒత్తిళ్ల మధ్య ప్రభుత్వ పెద్దలు కొట్టుమిట్టాడుతున్నారు. ఫ్రస్టేషన్‌లో మనిషి విచక్షణ కోల్పోయి మాట్లాడతాడని, ఎప్పుడూ ఏ నిర్ణయం తీసుకుంటారో.. సమయం, సందర్భం లేకుండా వారి వ్యవహారశైలి ఉంటుందని సైకాలజిస్ట్‌లు చెబుతుంటారు. ముఖ్యమంత్రి, మంత్రులు కూడా మనుషులే కదా.ఫార్ములా- ఈ రేస్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, అధికారుల పాత్ర కూడా ఏమీ లేదని, తానే స్వయంగా తన మంత్రిత్వ శాఖ నుంచి నగదును నిర్వాహకులకు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు కేటీఆర్ పలుమార్లు చెప్పారు. ఇందులో ఎలాంటి తప్పు జరగలేదని కేటీఆర్ చాలా సందర్భాల్లో స్పష్టం చేశారు. అయితే, తాజాగా కేటీఆర్‌పై కేసు నమోదు చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ, విద్యుత్ ఒప్పందాలపై విచారణ కమిషన్ల పేరుతో కాంగ్రెస్ మొదటి ఏడాది కాలం వెళ్లదీసింది. ఒట్లు, తిట్లు, బూతులతో పాలనను గాలికొదిలేశారు. ఇప్పుడు ఫార్ములా- ఈ రేస్ కేసులో కేటీఆర్ చుట్టూ రాజకీయాలు తిప్పుతూ రెండో ఏడాది కూడా గ్యారెంటీలు అమలు చేయకుండా కాలం వెళ్లదీసే వ్యూహాల్లో అధికార పార్టీ నేతలు ఉన్నారు.ఫార్ములా- ఈ రేస్ విషయంలో ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై కేటీఆర్ మొదటి నుంచి సవాల్ విసురుతూనే ఉన్నారు. లీక్ వార్తలతో కేటీఆర్‌ను భయపెట్టేందుకు సర్కారు ఎంత కఠినంగా వ్యవహరించాలని చూస్తుందో అంతే కఠినంగా తప్పు చేస్తే అరెస్టు చేసుకోవాలని కేటీఆర్ ధైర్యంగా సవాల్ చేస్తున్నారు. తాజాగా కేసుకు ముందే దమ్ముంటే అసెంబ్లీ సమావేశాల్లో ఫార్ములా- ఈ రేస్‌పై చర్చ పెట్టాలని ఏకంగా స్పీకర్‌కు, సీఎంకు లేఖ రాసి అధికార పార్టీని కేటీఆర్ ఇరుకున పెట్టారు. ఈ క్రమంలో అధికార పార్టీని డిఫెన్స్‌లో పడేశారు.కేటీఆర్ డిమాండ్ చేసినట్టు సభలో చర్చ పెడితే వాస్తవాలు తెలంగాణ సమాజానికి తెలుస్తాయి. ఒకవేళ సభలో చర్చకు పెట్టకపోతే ఇన్ని రోజులు కేటీఆర్‌పై ప్రభుత్వం చేసిందంతా తప్పుడు ప్రచారం అని జనాలకు అర్థమైపోతుంది. అందుకే, అసెంబ్లీ సమావేశాలు ముగిసే సమయంలో కేటీఆర్‌పై కేసు పెట్టించి, లగచర్ల రైతుల విడుదల విషయం మీడియాలో ప్రచారానికి నోచుకోకుండా మరో డైవర్షన్ ఎత్తుగడకు కాంగ్రెస్ సర్కార్ పాల్పడింది.

# అణ్వస్త్ర ప్రమాదం



ప్రపంచవ్యాప్తంగా ఆయుధ పోటీ క్రమంగా పెరుగుతుండటం ఆందోళనకరం. ఉక్రెయిన్‌కు అమెరికా సరఫరా చేసిన దీర్ఘకాలిక క్షిపణులు రష్యా భూభాగంపై ప్రయోగించేందుకు అనుమతిస్తూ అధ్యక్షుడు జో బైడెన్ ఇటీవల ఫర్మానా జారీచేయడంతో ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. ఆ వెనువెంటనే ఉక్రెయిన్ కొన్ని క్షిపణులను రష్యాపై వేసింది కూడా. దీన్ని అమెరికా ప్రత్యక్ష దాడిగా భావిస్తామని, అణ్వస్త్ర వినియోగ విధానంలో మార్పులు చేస్తామని రష్యా వెల్లడించడం ఓ ప్రమాదకరమైన మలుపు. దీంతో అణ్వస్త్ర ముప్పు మరోసారి తెరమీదకు వచ్చింది. అణ్వస్త్ర పరిమితి ఒప్పందాలను తాము ఖాతరు చేయబోమని, అవి కాలగర్భంలో కలిసిపోయినట్టేనని రష్యా సైనికదళాల ప్రధానాధికారి జనరల్ వాలెరీ గెరాసిమోవ్ తేల్చిచెప్పడం గమనార్హం. పాశ్చాత్య ప్రపంచంపై నమ్మకం సన్నగిల్లడమే ఇందుకు కారణమని ఆయన తేల్చి చెబుతున్నారు.2002లో విధ్వంసక క్షిపణుల ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడంతో అగ్రరాజ్యాల మధ్య ఆయుధ పోటీకి బీజం పడింది. అప్పటినుంచి ఒకదాని తర్వాత ఒకటిగా ఆయుధ పరిమితి ఒప్పందాలన్నీ కుప్పకూలుతూ వచ్చాయి. చివరగా మిగిలిన వ్యూహాత్మక ఆయుధ పరిమితి ఒప్పందం గడువు 2026 ఫిబ్రవరిలో ముగిసిపోతుంది. అంటే గత 50 సంవత్సరాల చరిత్రలో బడా అణ్వస్త్ర దేశాల మధ్య ఎలాంటి ఒప్పందాలు లేని పరిస్థితిని ప్రపంచం ఎదుర్కోబోతున్నది.రష్యా చేసిన ప్రకటనతో అది అంతకంటే ముందే జరిగిపోతుందేమోననే భయాలు వెంటాడుతున్నాయి. నేటిరోజుల్లో అణ్వస్త్ర సమస్య అనేది అమెరికా రష్యాలకే పరిమితం కాలేదు. చైనా కూడా ఆయుధపోటీలోకి దూకుడుగా దిగడంతో పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా తయారైంది. ఈ సరికే చైనా 500 అణ్వస్త్రాలు పోగేసుకున్నట్టు ఒక లెక్క. దశాబ్దం చివరి నాటికి ఆ సంఖ్యను వెయ్యికి, 2035 నాటికి అమెరికా, రష్యాలతో సమానంగా 1,500కు పెంచాలని చూస్తున్నది. దీనివల్ల అణ్వాయుధ పరిమితి చర్చల్లో పాల్గొనాల్సిన దేశాల సంఖ్య రెండు నుంచి మూడుకు పెరుగుతుంది.అణ్వస్త్రాల సమస్య భారత్ తలుపు తడుతున్న సూచనలూ కనిపిస్తున్నాయి. పొరుగున ఉన్న పాక్, చైనాలు ప్రకటిత అణ్వస్త్ర దేశాలు. ఇటీవల బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజా తిరుగుబాటు ఫలితంగా షేక్ హసీనా ప్రధాని పదవి కోల్పోయి దేశం వదిలి పారిపోయిన తర్వాత భారత వ్యతిరేక శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో గత సెప్టెంబర్‌లో షహీదుజ్జమాన్ అనే వివాదాస్పద ప్రొఫెసర్ బంగ్లా-పాక్ మధ్య అణ్వస్త్ర రక్షణ ఒప్పందం కుదిరితే బాగుంటుందని చేసిన సూచన సంచలనం కలిగించింది. సాధ్యాసాధ్యాల సంగతి అటుంచితే ఇది భారత్‌కు వ్యూహాత్మకంగా ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. అణుయుద్ధం ఎప్పుడు, ఎవరి మధ్యన జరిగినా విజేతలంటూ ఎవరూ మిగలరనేది నిర్వివాదాంశం. మూడు దశాబ్దాలుగా ఒప్పందాలు కలిగించిన భరోసా అంతమైపోతున్నది. 1962లో క్యూబా సంక్షోభం తర్వాత మళ్లీ అణ్వస్త్రాల ఉపయోగం గురించిన మాటలు వినవస్తున్నాయి. ఇది ఎటు దారితీస్తుంది!

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com